క్లుప్తంగా

అతిసార నియంత్రణ మాసోత్సవాలు



పెరవలి(వేమూరు): మండలంలో ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మండల వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో సోమవారం ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 5 ఏళ్ల లోపు పిల్లలకు ముందుగానే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. రెండు నెలలు పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరికైనా విరోచనాలు, వాంతులు అవుతున్నట్లయితే వెంటనే వైద్య సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ పద్మజ, క్రిష్ణవేణి, సంధ్యారాణి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు, నోటు పుస్తకాలు అందజేత



రేపల్లె రూరల్: డాక్టర్స్‌డే సందర్భంగా వైష్ణవీ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏవీ సుబ్బారావు సహకారంతో పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు పదో తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవీ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు బాబూజీ, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ



పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోన రైతు భరోసా కేంద్రానికి బాపట్ల ఏరువాక కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ బాల మురళీధర్ నాయక్, సమన్వయకర్త డాక్టర్ జె.రాధాకృష్ణ సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు బీపీటీ-2858 వరి చిరు సంచుల విత్తనాలు, నవారా రకం విత్తనాలను ఉచితంగా అందచేశారు. వ్యవసాయశాఖాధికారి జి.మీరయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.యుగంధర్, గోకుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



నిజాంపట్నం: ఎంతో మంది ప్రాణాలు కాపాడే వైద్యుల సేవలు ఎనలేనివని నిజాంపట్నం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె గౌరీ శంకర్ తెలిపారు. నిజాంపట్నం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ చినగురువులు, శ్రీపతి, ఇంతియాజ్, అనూష, లక్ష్మణబాబు, ముస్తాఫా, కృష్ణవేణిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జాయింట్ సెక్రటరీ బసవరాజు, రెడ్‌క్రాస్ సభ్యులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కేర్ టేకర్స్ నియామకానికి ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివ పేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలకు అనుబంధంగా ఉన్న విద్యార్థినుల వసతి గృహంలో కేర్ టేకర్స్ పోస్టులకు ఈ నెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆక్షణీయమైన వేతనంతో పాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ- 2024 పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ క్వాలీఫై అయిన 200 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టీటీసీ, బీఎడ్ మార్క్ లిస్టులు, టెట్ మార్క్ లిస్టులు, ధ్రువీకరణ పత్రాలతో జూలై 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ప్రజారంజక పాలనతో ముందుకు వెళతాం

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్
- నిజాంపట్నంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



నిజాంపట్నంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి అనగాని, ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఆర్డీవో హేలా షారోన్

నిజాంపట్నం: ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని జల్సా బజారులో వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చి రూ.7 వేలు అందించడంతో ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం రానున్న రోజుల్లో ప్రజలకు ఎంతో మెరుగైన పాలనను అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. తొలుత మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు సమర్థంగా అమలు

రేపల్లెరూరల్: ప్రజలకిచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె నియోజకవర్గంలో రేపల్లె పట్టణ, మండల, నగరం, చెరుకుపల్లి మండలాలలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్‌దారులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారన్నారు. పింఛన్ల పంపిణీలో అవినీతికి తావివ్వకుండా సచివాలయ ఉద్యోగుల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. నిజాంపట్నం మండలంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో హెలా షారోన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, ఆయా మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను

బాపట్లటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందజేయటం జరుగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని స్టువార్టుపురం, పాండురంగాపురం, చెరువుజమ్ములపాలెం, పట్టణంలోని 13, 32, 30 వార్డుల్లోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అర్హత కలిగి పెన్షన్లు అందక ఇబ్బందులు పడుతున్నట్లయితే వారిని గుర్తించి వెంటనే పెన్షన్లు మంజూరు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.విజయశేఖర్, మాజీ మండలపార్టీ అధ్యక్షులు కావూరి శ్రీనివాస రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి చెన్నుపాటి కిషోర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పాండురంగాపురంలో వృద్ధులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

93 శాతం పింఛన్లు పంపిణీ

కర్లపాలెం: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కర్లపాలెం మండల పరిధిలో సోమవారం 93 శాతం మేర పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.నేతాజీ తెలిపారు. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలలో 8,059 పింఛన్లకు గానూ 7,373 మందికి నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో చెప్పారు. పేరలి, కర్లపాలెం, యాజలి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఆయా గ్రామ పంచాయతీలలో సచివాలయ సిబ్బందితో కలసి టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొన్ని గ్రామాలలో సర్వర్ సిగ్నల్ సమస్యతో పింఛన్ల పంపిణీకి ఆటంకం కలిగింది.



భట్టిప్రోలులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

సర్వర్ మొరాయించడంతో వృద్ధుల పాట్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి, ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, మండల ప్రత్యేక అధికారి జె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. సర్వర్ సరిగా పనిచేయక పింఛన్‌ల పంపిణీకి అంతరాయం కలిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయ సిబ్బంది, అధికారుల చేత పింఛన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆన్‌లైన్ సర్వర్ సరిగా పని చేయకపోవడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని వెల్లటూరులో పింఛన్‌దారుల ఇంటికి ఎవరూ రాకపోయే సరికి సచివాలయం వద్దకు రిక్షా బాడుగకు కట్టించుకుని వృద్ధులు, వికలాంగులు వచ్చారు. గంటల పర్యంతం సచివాలయం వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సూరేపల్లిలో ఒకే చోటకు పిలిపించి పింఛన్‌దారులకు పంపిణీ చేయడం జరిగింది. ఇదే పరిస్థితి అన్ని చోట్లా కనపడింది. ఇంటింటికి తిరిగి ఇవ్వకుండా ఇదేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఆళ్లమూడి, పల్లెకోన, సూరేపల్లి గ్రామాలలో తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి పింఛన్‌లను పంపిణీ చేశారు.



కర్లపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

వేమూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు నియోజక వర్గంలోని జంపని గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేతి వృత్తి, కళాకారులకు పెంపుదల చేసిన పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునకు పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దండే సుబ్బారావు, గ్రామ సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ, నియోజకవర్గ జనసేన కన్వీనర్ ఊస రాజేష్, జొన్నలగడ్డ విజయబాబు, వేల్పూల రవి కుమార్, వట్టిప్రోలు యోబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ హనీఫ్, వేల్పూల జయ ప్రకాశ్, గవిని లక్ష్మీ దుర్గ, పల్లా వాసు, బండారు నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిరాట్లంకలో 98 శాతం పింఛన్ల పంపిణీ



రేపల్లె రూరల్: మండలంలోని పిరాట్లంక పంచాయతీలో 98 శాతం పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందని సర్పంచ్ కమతం రమాదేవి తెలిపారు. సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంచాయతీలో 467 మంది పింఛన్‌దారులు ఉండగా తొలి రోజు 462 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కమతం ఫౌండేషన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు, కమతం ఫౌండేషన్ ట్రస్టీ కమతం విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి గారి విజయ మణి బాబు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వేమూరులో గ్రామసభ

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభ మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కర్లపాలెం: విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన సంఘటన కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం పంచాయతీ ఉమ్మారెడ్డినగర్ ఆర్చ్ సమీపంలోని మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్తంభం వద్ద ఎర్త్ వైరుకు గేదె తగలటంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందని స్థానికులు తెలిపారు. సంఘటన సోమవారం ఉదయం జరుగగా గేదె కోసం రైతులెవరూ రాలేదని పంచాయతీ అధికారులకు సమాచారం అందించామని స్థానికులు తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సర్పంచుల మండిపాటు

అధికారుల తీరుపై ఆక్షేపణ

వేమూరు: సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారని కొందరు గ్రామ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఫించన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం, అధికారులు గ్రామ సర్పంచ్‌లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలుగు దేశం ప్రభుత్వంలోని అధికారులు గ్రామ సర్పంచ్‌లకు గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ప్రజలు చేత ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వకుండా పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. వేమూరు మండలంలోని వెల్లబాడు, అబ్బనగూడవల్లి, పోతుమర్రు గ్రామాల్లో సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వలేదన్నారు.

గ్రామ సర్పంచ్‌లకు ప్రాధాన్యత లేదు



సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు సమాచారం ఇవ్వలేదు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ అధికారులు ఆ పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సర్పంచ్‌లకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

వెల్లబాటి బుల్లియ్య, గ్రామ సర్పంచ్, వెల్లబాడు.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టాలి



సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. అధికార పార్టీ కనీస మర్యాదలను పాటించకపోవడం బాధాకరం.

కొండి శెట్టి రాంబాబు, గ్రామ సర్పంచ్, అబ్బనగూడవల్లి.

నిబంధనలకు విరుద్ధం



సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటో కాల్ ఉల్లంఘించడం నిబంధనలకు విరుద్ధం. తెలుగు దేశం పార్టీ అధికారం చేపట్టిన తర్వాత అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కూచిపూడి మైనా, గ్రామ సర్పంచ్, పోతుమర్రు గ్రామం.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు

ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడు ఫిర్యాదులు అందాయని ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రేపల్లె - పెనుమూడి డ్రెయిన్ పూడిక తీయించాలని, నియోజకవర్గ పరిధిలోని అన్ని పంట కాలువలలో గుర్రపు డెక్క ముళ్లపొదలు తొలగించాలని, రైతు భరోసా ఇప్పించాలని, తన ఇంటి స్థలంలో వేరొకరు అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఆ ఇంటి నిర్మాణ పనులను నిలిపి వేయవలసిందిగా కోరుతూ వేర్వేరుగా నాలుగు అర్జీలు రేపల్లె మున్సిపాలిటీ నుంచి అందినట్లు చెప్పారు. ప్రభుత్వ పంట కాల్వలను పూడ్చి వేసి పంట పొలాలకు సాగునీరు అందకుండా చేస్తున్నారని, కాలువ పూడిక తీయించి సాగునీరు పొలాలకు అందచేయవలసిందిగా నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామం నుంచి అర్జీ అందిందన్నారు. సాగుభూమిని ఆన్‌లైన్ చేయాలని కొల్లూరు మండలం చింతలంక గ్రామం నుంచి అర్జీ అందిందన్నారు. ఇండియన్ బుల్స్ యాప్ నందు రూ.20వేలు నష్టపోయానని తిరిగి తన నగదును తనకు ఇప్పించవలసిందిగా కోరుతూ నగరం మండలం ఏలేటివారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి అర్జీ అందించాడన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

కొరటాల సేవలు చిరస్మరణీయం

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: తీర ప్రాంతానికి, పేద ప్రజలకు కొరటాల సత్యనారాయణ చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. మాజీ శాసన సభ్యుడు కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలోని కొరటాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో పాల్గొన్న నేత కొరటాల అని కొనియాడారు. కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజా నాయకుడన్నారు. రేపల్లె ఏరియాలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని కృషి చేశారన్నారు. లంకభూముల సమస్యపై నిరంతరం పోరాటాలు నడిపారన్నారు. పేద ప్రజలను సొసైటీలుగా ఏర్పాటు చేసి భూస్వాముల ఆధీనంలో ఉన్న లంక భూములను పేదలు సాగు చేసుకునే విధంగా పోరాటాల ద్వారా విజయం సాధించారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకుడిగా పేద రైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని చెప్పారు. రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1962, 1978లలో రెండు సార్లు శాసనసభకు ఎన్నికై ప్రజా ప్రతినిధిగా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించేవారన్నారు. బుంగపోత రైతులకి సబ్సిడీపై కిరోసిన్, దళిత గ్రామాల్లో స్మశాన స్థలాలు, రోడ్లు, విద్యుత్ సదుపాయాల కల్పనకు పోరాటాలు చేశారన్నారు. అనంతరం కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు కెవి.లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, జి.దానియేలు, డి.శ్రీనివాసరావు, ఆగస్టిన్, జి.ధర్మరాజు, సీఐటీయూ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు యు.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భట్టిప్రోలులో కొరటాలకు ఘన నివాళి

భట్టిప్రోలు: సీపీఎం అగ్ర నాయకులు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కొరటాల సత్యన్నారాయణ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు మురుగుడు సత్యన్నారాయణ మాట్లాడుతూ రేపల్లె ప్రాంతంలో చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని కృషి చేసిన యోధుడని పేర్కొన్నారు. జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకులుగా పేద రైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కొరటాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకువెళదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆకురాతి శ్రీనివాస రావు, బి.నాగమల్లేశ్వరరావు, పప్పల అహరోను, పి. మనోజ్‌కుమార్, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంపుతో పేదలకు లబ్ధి

కుచ్చెళ్లపాడు(వేమూరు): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పింఛన్లు పెంపుదల చేయడం జరిగిందని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ అన్నారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.4వేలు పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పింది. అదే విధంగా పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాజుల వెంకట సుబ్బయ్య, సోమరౌతు బ్రహ్మమ్మ, మాజీ సర్పంచ్ తాడి కొండ కోటేశ్వర రావు, తూలం రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు

వేమూరు: ఖరీఫ సీజన్‌లో రైతులకు వరి విత్తనాలు రాయితీపై అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని రైతులంతా విత్తనాలు తీసుకోవాలని ఆమె కోరారు.

పెన్‌పాల్ లేఖలు ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సోమవారం యుఎస్ఏ(అమెరికా) నుంచి వచ్చిన పెన్‌పాల్ (ఉత్తర ప్రత్యుత్తరాలు) లెటర్స్‌ను గుంటూరులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదగా ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో గత ఏడేళ్లుగా వైవిధ్య భరిత కార్యక్రమాలను ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ హరికృష్ణ చేస్తున్న ప్రయోగాన్ని ఉపాధ్యాయులు ప్రేరణగా తీసుకుని వినూత్న బోధన చేయాలని కోరారు. పెన్‌పాల్ ప్రోగ్రామ్‌ను థామస్ విజ్డయండ్ (ఒమెహాసిటీ, నంబ్రస్కా రాష్ట్రం-యుఎస్ఏ) ఐలవరం ఆంగ్లోపాధ్యాయులు హరి కృష్ణతో కలసి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు తన సహకారాన్ని అందిస్తున్నారు.



గుంటూరులో పెన్‌పాల్ లేఖలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

చినపరిమి సొసైటీ మాజీ చైర్మన్ మృతి

వేమూరు: మండలంలోని చినపరిమి గ్రామ వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మా వీర సాంబరెడ్డి(70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయన్ని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు సోమవారం సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తమ్మా బసివి రెడ్డి, గాదె శివరామకృష్ణా రెడ్డి, తమ్మా పాములరెడ్డి, కర్షక్ శ్రీనివాసరెడ్డి, అళ్ల సత్యనారాయణ రెడ్డి, ముప్వ సాంబరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు

8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ నాటికల పోటీలు

తెనాలి: ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ కళాపరిషత్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి ప్రథమ నాటికల పోటీలను నిర్వహించనున్నారు. ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం నాటికల పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి రొటేరియన్ గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్‌లు వివరాలను తెలియజేశారు. పోటీల సందర్భంగా రోటరీలో విశేష సేవలను అందించిన పీఈజీ అన్నే రత్నప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారీస్ పేరుతో ఇచ్చే అవార్డును 8వ తేదీ సాయంత్రం జరిగే సభలో అందజేస్తామని తెలిపారు. పావులూరి రాంబాబు, కాకుమాను ఉపేంద్ర, గుమ్మిడి ప్రసాద్, దేవయుజనం మురళీకృష్ణ, పూసపాటి మాలకొండయ్య, మంచాల సురేష్, నల్లూరి వెంకటేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పద్మప్రియ



లక్ష్మీపురం: పంచేంద్రియాలలో అతి ముఖ్యమైన నయనం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పద్మప్రియ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నలభై ఏళ్లు పైబడిన వారు కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. శుక్లాలు, నీటి కాసుల వ్యాధులు ఈ మధ్య చాలా ఎక్కువగా వస్తున్నాయన్నారు. చూపుకి అడ్డు పడి చికాకు కలిగించే ఫ్లొటర్స్ సమస్య ఉన్నప్పుడు మాత్రం డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. ఆకు కూరలు, పండ్లు వంటివి తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగ్గా ఉంటుందని వైద్యురాలు వివరించారు.